క్లుప్తంగా

వేసవి శిక్షణ తరగతులకు విశేష స్పందన


శిబిరంలో చిన్నారులకు బోధిస్తున్న లక్ష్మణరావు

విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగలో ఉన్న గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు చిన్నారుల నుంచి విశేష స్పందన లభిస్తోందని లైబ్రేరియన్ ఎం.లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన చిన్నారులతో చదివించడం, దస్తూరి, చెస్, క్యారమ్స్, లూడోగేమ్స్, కథలు, శతక పద్యాలు పాడించారు. అవకాశం ఉన్న వారంతా తమ చిన్నారులను వేసవి శిక్షణ శిబిరాలకు పంపించాలని కోరారు.

గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యదర్శిగా చిరంజీవి


చిరంజీవిని అభినందిస్తున్న గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు

విజయనగరం ఫోర్ట్: ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యదర్శిగా జిల్లాకు చెందిన గద్దె చిరంజీవి ఎన్నికయ్యారు. విశాఖపట్నంలో మంగళవారం జరిగిన గ్రామీణ వైద్యుల సంఘం కార్యవర్గ సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో జోనల్ న్యాయ సలహాదారు కేపీ దేశాయ్, జోనల్ గౌరవ అధ్యక్షుడు తిరుపతిరావు, జోనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నూతన అధ్యక్షుడు జంగం జోషి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- ఏడో వార్డులో పర్యటించిన కమిషనర్, కౌన్సిలర్


తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్

నెల్లిమర్ల: ఏడో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని నగర పంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్, ఏడో వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ తెలిపారు. కమిషనర్, కౌన్సిలర్ కలిసి ఆ వార్డులో మంగళవారం పర్యటించారు. ఆయా వీధుల్లో తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. మురుగునీటి కాలువల్లో పూడికల తొలగింపు పనులపై ఆరా తీశారు. వీధిలైట్ల నిర్వహణను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

ఆశ వర్కర్లకు భద్రత కల్పించండి

- సీఐటీయూ నగర అధ్యక్షుడు జగన్ మోహన్ రావు

విజయనగరం ఫోర్ట్: ఆశవర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్ రావు అన్నారు. ఈ మేరకు మే20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలను గాజులరేగ యూపీహెచ్‌సీలో ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆశవర్కర్లకు జీతం పెంచుతుందని, ఉద్యోగ భద్రత కల్పిస్తుందని ఆశించారని, ఆశవర్కర్లకు పనిభారం పెరుగుతోంది తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఆన్‌లైన్ సర్వేలు, యాప్‌ల ద్వారా ఆశవర్కర్లు 24 గంటలు పనిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

1న విద్యుత్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మేడే వేడుకలు

విజయనగరం ఫోర్ట్: మేడే సందర్భంగా స్థానిక దాసన్న పేట ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో మేడే వేడుకలు నిర్వహించనున్నట్లు సంఘం రీజనల్ కార్యదర్శి సురగాల లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యుత్ శాఖ ఎస్ఈ ముప్పల లక్ష్మణరావు హాజరవుతారని తెలిపారు.

విలేకరులపై దాడులు సిగ్గు చేటు

నెల్లిమర్ల రూరల్: విలేకరులపై అధికార పార్టీ నాయకుల దాడులు సిగ్గు చేటు అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తే ఉలికిపాటు ఎందుకని ప్రశ్నించారు. ఏలూరులో సాక్షి కార్యాలయంపై దాడి మరువక ముందే..శ్రీకాళహస్తిలో సాక్షి విలేకరులపై టీడీపీ నాయకుల దాడి బాధాకరమన్నారు. మీడియా ప్రతినిధులపై బాధ్యతారహితంగా ప్రవర్తించడం సరికాదని, చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని హితవు పలికారు. మీడియా సంస్థలు, వ్యక్తులపై దాడులను ప్రతి ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ తరహా దాడులు సమాజానికి మంచిది కాదని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల ఉక్కిరిబిక్కిరి

- ఇరుకు గదుల్లో విద్యాభ్యాసం
- అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవుల ఊసెత్తని ప్రభుత్వం


సీహెచ్ అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులు

పూసపాటిరేగ: పెరిగిన ఉష్ణోగ్రతలతో చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఓవైపు ఇరుకు గదులు, వెంటిలేషన్ లేని ప్రైవేట్ గదులు కావడంతో చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం సెలవులు ఇవ్వడం లేదు. ఓ వైపు హాజరు శాతం తగ్గుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పెద్ద వయసు పిల్లలున్న పాఠశాల, కళాశాలల విద్యార్థులకు సెలవులు ఇచ్చిన ప్రభుత్వం చిన్నారుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందో తెలియని పరిస్థితి. అంగన్‌వాడీ చిన్నారులకు వేసవిలో సెలవులు ఇవ్వాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో 272 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 210 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 62 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 980 మంది గర్భిణులు, 815 మంది బాలింతలు, ఆరు నెలలు లోపు చిన్నారులు 870 మంది, ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాలు లోపు చిన్నారులు 3540 మంది, మూడు సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులు 2750 మంది ఉన్నారు. 272 అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేస్తున్నప్పటికీ సౌకర్యాలు అందించడంలో ప్రభుత్వం విఫలం అవుతోందని వాపోతున్నారు. మే 1 వతేదీ నుంచి అంగన్‌వాడీ ఆయాలకు, మే 15 నుంచి కార్యకర్తలకు సెలవులు ప్రకటించినట్లు సమాచారం. చిన్నారులైన పసి మొగ్గలకు మాత్రం సెలవులు ఇవ్వకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రం నెలరోజులు కార్యకర్తే కేంద్రం నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. చాలా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రైవేట్ భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో ఇరుకు గదులు ఉండడంతో ఉష్ణోగ్రతలతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతల కారణంగా చాలా వరకు చిన్నారులను కేంద్రాలకు పంపించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని పాఠశాలలు, కళాశాలలు మాదిరి సెలవులు ఇవ్వాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పిల్లలను పంపించాలంటే భయంగా ఉంది

అంగన్‌వాడీ చిన్నారులను కేంద్రాలకు పంపించాలంటే భయంగా ఉంది. పెద్దవాళ్లు సైతం ఎండ వేడిని తట్టుకోలేక ఇంటికే పరిమితమవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్న చిన్నారుల విషయంలో మాత్రం వేసవిని ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు.
– లక్ష్మి, అంగన్‌వాడీ చిన్నారి తల్లి పూసపాటిరేగ

అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలి

వేసవి కారణంగా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రాబోయే రోజుల్లో మరింత తీవ్రంగా ఎండలు కాసే అవకాశం ఉంది. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో నిర్ణయం తీసుకోవాలి.
– సూర్యనారాయణ, సీఐటీయూ నాయకుడు

సమయపాలన ఏదీ..?

- మోదవలస సచివాలయ ఉద్యోగుల తీరు
- తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



10:20 గంటలైనా తెరచుకోని మోదవలస సచివాలయం

డెంకాడ: మండలంలోని మోదవలస గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు. గ్రామ స్థాయిలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందాలన్న లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సమయానికి విధులకు వచ్చి ప్రజలకు సేవలు అందించాల్సిన సచివాలయ ఉద్యోగులు తమకు నచ్చినప్పుడు వచ్చి, వెళ్లిపోతుండడంపై గ్రామస్తులు అసంతృప్తి చెందుతున్నారు. సచివాలయ ఉద్యోగుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. ఇదే విషయమై మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మంగళవారం కూడా యథావిధిగా పదిన్నర గంటల తర్వాత ఒక ఉద్యోగి వచ్చి సచివాలయాన్ని తెరవడం, తర్వాత ఒక్కొక్కరు నచ్చిన సమయానికి విధుల్లో చేరడంపై గ్రామస్తులు మండిపడ్డారు. ఇదే విషయంపై ఎంపీడీఓ భవానీ మాట్లాడుతూ మోదవలస సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదు వచ్చిందన్నారు. ఇప్పటికే హెచ్చరించామని, తీరు మారకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

చలివేంద్రాలను వినియోగించుకోవాలి



చలివేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం కొత్తపేట నీళ్లట్యాంకు, దాసన్నపేట రైతు బజార్, కలెక్టర్ ఆఫీస్ జంక్షన్, నగర పాలక సంస్థ కార్యాలయం, మయూరి ఎత్తు బ్రిడ్జి డౌన్, ఆర్టీసీ కాంప్లెక్స్, రింగ్ రోడ్ ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్, ఎన్‌సీఎస్ గాంధీ జంక్షన్, కోట జంక్షన్‌లలో కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీ ర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్న రీత్యా ప్రజలు డీహైడ్రేషన్‌కు గురికాకుండా తరచూ మంచినీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తీసుకోవాలని సూచించారు.

కౌన్సిల్ సమావేశం బహిష్కరణ

- సమావేశానికి ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే హాజరు
- సమావేశం వాయిదా వేసిన కమిషనర్ తారక్‌నాథ్


కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న సమావేశ మందిరం

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సభ్యులు, చైర్‌పర్సన్ మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. చైర్ పర్సన్ బంగారు సరోజినిని టార్గెట్ చేస్తూ వైఎస్సార్‌సీపీకి చెందిన 9 మంది, టీడీపీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. కేవలం జనసేన పార్టీకి చెందిన 14వ వార్డు కౌన్సిలర్ జానా సంధ్యారాణి, బీజేపీకి చెందిన 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ మాత్రమే హాజరయ్యారు. చైర్ పర్సన్ అధ్యక్షతన జరగాల్సిన సమావేశానికి చైర్‌పర్సన్ కూడా హాజరుకాకపోవడం గమనార్హం. దీంతో చేసేదేమీ లేక సమావేశం వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ తారక్ నాథ్ ప్రకటించారు. చనిపోయిన పారిశుద్ధ్య కార్మికుల స్థానంలో కొత్తవారిని నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టడం, బైరెడ్డి సూర్యనారాయణ కళ్యాణ మండపం అభివృద్ధి, పట్టణంలోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణ తదితర విషయాల్లో కమిషనర్, చైర్ పర్సన్ తీరుపై కౌన్సిలర్లు విభేదిస్తున్నట్టు సమాచారం. భవిష్యత్తులో జరిగే సమావేశాలకు కూడా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు పలువురు కౌన్సిలర్లు చెబుతున్నారు.

సరుగుడు తోట దగ్ధం


సరుగుడు తోటలో వ్యాపించిన మంటలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం కోనూరు రెవెన్యూ పరిధిలో ఎనిమిది ఎకరాల సరుగుడు తోట దగ్ధమైందని అగ్నిప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పూసపాటిరేగ మండలం వెల్దూరు గ్రామానికి చెందిన బాధిత రైతు కాలపురెడ్డి ఆదినారాయణ గరివిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కోనూరు గ్రామానికి చెందిన రైతు నుంచి 8ఎకరాల భూమిని శిస్తుకు తీసుకుని ఆ భూమిలో బోరు,పైపులైన్ వేసి సరుగుడు తోటను సాగు చేశానని పేర్కొన్నాడు. ఈ సరుగుడు తోటకు సమీపంలో గ్రామానికి చెందిన మరోరైతు బోరు వేసి వ్యవసాయం చేస్తున్నాడని, కొన్ని నెలలుగా పాడైపోయి ఉన్న విద్యుత్ తీగల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా దొంగతనంగా విద్యుత్‌ను తీసుకునే క్రమంలో పెద్దఎత్తున మంటలు వ్యాపించి తన సరుగుడు తోట దగ్ధమైందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ప్రమాదంలో రూ.50 లక్షల విలువైన సరుగుడు తోటతో పాటు రూ.3లక్షల విలువైన పైప్‌లైన్, కేబుల్ వైర్లు ధ్వంసమై నష్టపోయాయని వాపోయాడు. ఈ విషయమై సంబంధిత శాఖాధికారులను ప్రశ్నించగా తమకు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకున్నారని వాపోయాడు. తనకు న్యాయం జరిగేలా చూడాలని ఫిర్యాదులో అభ్యర్థించాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: విద్యుత్ సబ్‌స్టేషన్, లైన్ల నిర్వహణ, విభజన పనుల కారణంగా మండలంలోని అక్కివరం, రాజుపులోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. అక్కివరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అక్కివరం, బంటుపల్లి, పేడాడ, రాజలతమ్మాపురం, గొలగాం, గంట్లాం, బెల్లాం, చినఅమకాం, అమకాం గ్రామాలకు పూర్తిగా, డి.తాళ్లవలస, టి.కల్లాలు గ్రామాలకు సగభాగం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. రాజపులో విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మోదవలస, గొండయ్యపాలెం, జన్నాథపురం, జరజాపుకల్లాలు, బంగార్రాజుపేట, కొండరాజుపేట, చినవల్లూరు, పెదవల్లూరు, భోగాపురం మండలలోని పోలిపల్లి, మహరాజుపేట, రాజపులోవ, చెరుకుపల్లి గ్రామాలకు విద్యుత్‌ను నిలిపివేస్తామన్నారు.

నేడు ఈ గ్రామాలకు పవర్ కట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ నిర్వహణ పనులు బుధవారం చేపడతామని విద్యుత్ శాఖ డీఈఈ పి.త్రినాథరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీలంక పర్యటనకు ప్రత్యేక ప్యాకేజీ

విజయనగరం టౌన్: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) అందిస్తున్న ఎయిర్ ప్యాకేజీలను సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు చందన్ కుమార్, సాయి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు శ్రీలంక ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేశామన్నారు. జూన్ 28 నుంచి జూలై 3వ తేదీ వరకు పర్యటన ఉంటుందన్నారు. శ్రీలంకలో కొలంబో, దంబుల్లా, కాండీ, నువరేలియా, మునీశ్వరం ఆలయం, మనవేరి ఆలయం, దంబుల్లా గుహ ఆలయం, శ్రీలక్ష్మీనారాయణ పెరుమాళ్ ఆలయం, శ్రీభక్త హనుమాన్ ఆలయం, రంబోడ, సీతఅమ్మన్ ఆలయం, సీతా ఎలియా, అశోక వాటిక, తదితర ప్రాంతాలు ప్యాకేజీలో ఉంటాయన్నారు. వివరాలకు సెల్: 92810 30748, 92814 95847 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలసలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు రవి ఆధ్వర్యంలో పెద్దలు, గ్రామస్తులతో ఉదయం పూజలు చేయించారు. సాయంత్రం పూర్ణకలశం, ఘటాల ఊరేగింపు చేశారు. బుధవారం ప్రత్యేక పూజలు, గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


పూర్ణకలశం, ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

రక్తదాన శిబిరాలు పెద్ద సంఖ్యలో జరగాలి


రక్తదానం కార్యక్రమంలో పాల్గొన్న చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర

విజయనగరం గంటస్తంభం/విజయనగరం టౌన్: జిల్లాలో రక్తదాన శిబిరాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున జరగాల్సిన అవసరం ఉందని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి, చిన్న సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మాతృభూమి సేవాసంఘం, ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో తెలుగుంటి సురేష్ పుట్టినరోజు సందర్భంగా యూత్ హాస్టల్లో జరిగిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ..జిల్లాలో ప్రస్తుతం రక్తం అందక చాలామంది రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని కొంతమంది డాక్టర్లు రోగులను విశాఖపట్నం పంపేస్తున్నారని స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వంలోని అధికారులు రక్తదానంపై విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని కోరారు. ఘోషాఆస్పత్రిలో రక్తం అవసరంపై అధికారులు ఆలోచన చేయాలని కోరారు. చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర మాట్లాడుతూ యువజన మహిళా సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని ప్రముఖుల జయంతి, వర్ధంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎంఆర్‌పీఎస్ నాయకులు సుధాకర్, శ్రీనివాస్, అంజిబాబు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీని నిర్మూలిద్దాం


ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన దృశ్యం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం గంటస్తంభం: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఒక చారిత్రాత్మక చైతన్య దినమని, చికాగోలో కార్మికలోకం రక్తతర్పణం చేసి కేవలం తమ దేశపు కార్మికవర్గానికే కాకుండా ప్రపంచ కార్మిక లోకానికింతటికీ కొత్త వెలుగును అందించిన రోజు ప్రపంచ కార్మిక దినోత్సవం 139వ మేడేను కార్మికలోకం అంత ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వీటీ అగ్రహారం దగ్గర గల ఫ్లోర్ మిల్లు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ప్రచార వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ..రోజుకు 24 గంటల్లో 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, మిగిలిన 8 గంటలు రిక్రియేషన్ కోసం కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర సమితి నాయకుడు బూర వాసు, కార్మికులు పాల్గొన్నారు.

రహదారులపై విచ్చలవిడిగా వ్యర్థాలను వేయరాదు


5,6 సచివాలయాల పరిధిలో పరిశీలిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

- నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలోని రహదారులపై విచ్చలవిడిగా భవన నిర్మాణ వ్యర్థాలను వేయరాదని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య అన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం 5,6 నంబర్ సచివాలయాల పరిధిలో పర్యటించి సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ కార్యాలయాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి సిబ్బందిని మందలించారు. అలాగే విధులకు ఆలస్యంగా వచ్చిన ముగ్గురు కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు. అనంతరం డివిజన్ ప్రాంతంలో పర్యటించి స్థానికంగా నెలకొన్న పరిస్థితులను గమనించారు. అక్కడక్కడ రహదారులపై డెబ్రిస్ భవన వ్యర్థాలు ఉండడాన్ని గమనించి తక్షణమే తొలగించాలని ఆదేశించారు. వీధులు పరిశుభ్ర వాతావరణంలో ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు.అంతా బాగుందని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా శ్యామశాస్త్రి జయంతి


శ్యామశాస్త్రి కృతులను ఆలపిస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మఠంవీధి శంకరమఠం ఆవరణలో మంగళవారం సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్యామశాస్త్రుల 263వ జయంతిని సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సంగీత విద్వాంసుడు శ్యామశాస్త్రి కృతులను ఆలపించారు. ప్రముఖ వేణుగాన విద్వాంసుడు మోడేకుర్తి వెంకట కామేశ్వరరావు వయొలిన్‌పై సహకారమందించారు. అర్చకుడు పాకాల సూర్యనారాయణశర్మ పూజాదికాలు చేశారు. కార్యక్రమంలో ఇవటూరి మోహిర్లత, భానుమతి, కొత్తపల్లి సుబ్బారావు, గంధం సుజాత, జయంతి కామేశ్వరి, సోమేశ్వరరావు, గండికోట కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.